7

సాక్షి
మంచిర్యాల

సోమవారం ; 27 ; జనవరి ; 2025



మంచిర్యాల మున్సిపాలిటీలో కొత్తగా చేరిన వార్డు ఆఫీసర్లతో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

గణతంత్ర వేడుకల్లో కొత్త వార్డు ఆఫీసర్లు

మంచిర్యాలటౌన్: ఇటీవల నిర్వహించిన గ్రూప్–4 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నూతనంగా మున్సిపాలిటీలో చేరిన వార్డు ఆఫీసర్లు ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో 28 మందిని నూతనంగా నియమించగా, 19 మంది విధుల్లో చేరారు. ఇద్దరు కొత్తగా జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు.

అర్హులందరికీ సంక్షేమం



జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్



నందిని నృత్యకళా మందిరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- పకడ్బందీగా నాలుగు పథకాల అమలు
- జిల్లా అభివృద్ధికి పెద్దపీట
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని జిల్లాలో అర్హులందరికీ లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతన రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. 76వ గణతంత్ర వేడుకలను జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ భాస్కర్, డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ కుమార్ దీపక్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రిజర్వు పోలీస్ కమాండర్ వామనమూర్తి ఆధ్వర్యంలో కలెక్టర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత కుమార్ దీపక్ మాట్లాడారు. లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు.

మహాలక్ష్మి పథకం..

జిల్లాలో ఆడపడుచులు, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,30,51,686 మంది మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యం వినియోగించుకున్నారన్నారు. తద్వారా మహిళలకు రూ.32.47 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. జిల్లాలో 1,13,75 మంది లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ సిలిండర్ అందిస్తున్నామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తుండడంతో జిల్లాలో 6,950 మంది పేదలు లబ్ధిపొందారని తెలిపారు. వీరికి సుమారు రూ.11.14 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

గృహజ్యోతి పథకం..

విద్యుత్ బిల్లుల భారం తగ్గించి వినియోగదారులకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. 2024 మార్చి నుంచి డిసెంబర్ 2024 వరకు జీరో బిల్లు లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 41.48 కోట్లు రాయితీ అందజేసిందన్నారు.



భరతమాత వేషధారణలో విద్యార్థిని

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మంచిర్యాలఅగ్రికల్చర్: గణతంత్ర వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హాజీపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ సబ్బెపల్లి విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల దశలో విద్యార్థులు, యువత చదవుకు దూరం అవుతూ.. చెడుమార్గాన్ని ఎంచుకుని ప్రేమపేరుతో మహిళలను వేధిస్తూ.. ఉన్మాదిలా ప్రవర్తిస్తూ.. హత్యలకు వెనుకడాని తీరు.. భరత మాత భావోద్వేగం..జైలు పాలవుతున్న యువత.. పలు రకాల సన్నివేశాలు కండ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్ సింగ్ విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందించారు.



రుణమాఫీ: రూ.2 లక్షల రుణ మాఫీ పథకం ద్వారా జిల్లాలో 64, 493 మంది రైతులకు రూ.543 కోట్ల మాఫీ చేసిందన్నారు. జిల్లాలో 83,114 మంది రైతులకు రైతుబీమా ప్రయోజనం కింద చేర్చి 149 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున రూ.7.45 కోట్లు చెల్లించామన్నారు. రైతు భరోసా ప్రత్యేకంగా అమలుకు చర్యలు చేపట్టామన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కోసం 319 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 18,108 మంది రైతుల నుంచి 1,01,485 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.235 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు బోనస్ రూ.500 చెల్లించామన్నారు. వరద నీటి నుంచి రక్షణ కోసం కార్మెల్ ఉన్నత పాఠశాల సమీపంలోని రాళ్లవాగు నుంచి గోదావరి వరకు రూ.255 కోట్ల వ్యయంతో కరకట్ట నిర్మాణానికి అనుమతిలు లభించిందన్నారు.

ఇందిరా మహిళ శక్తి: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు క్యాంటీన్లు, మీ సేవ కేంద్రాలు, చిన్నపరిశ్రమలు ఇతర వ్యాపార విభాగాల ఏర్పాటుకు బ్యాంక్ లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాలు మహిళలకు ఆర్థిక చేయుత అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రూ.10 లక్షల విలువ గల సంచార చేపల అమ్మకం వాహనాన్ని లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా జరిపిన సర్వేలో ఇంటి స్థలం ఉండి పక్కా ఇల్లు లేని వారు 82,161 మంది, ఇంటి స్థలాలు లేని వారు 50,912 మందిని గుర్తించామన్నారు.

గ్రామీణాభివృద్ధి: జిల్లాలో 10,417 స్వయం సహాయక సంఘాలలో 1,15000 మంది సభ్యులు ఉండగా 2024–25 సంవత్సరానికి బ్యాంక్ లింకేజీ ద్వారా 3, 578 సంఘాలకు రూ.328 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 1,21000 వేల జాబ్‌కార్డులు అందించి 100 రోజుల పని కల్పించడం ద్వారా వేతనాల రూపంలో రూ.59.65 కోట్లు చెల్లించడంతో పాటు రూ.9.70 కోట్ల సామగ్రి సమకూర్చబడిందన్నారు.

పురపాలక సంఘాలు.. జిల్లాలోని 7 మున్సిపాలిటీలలో కోట్ల రూపాయల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సమీకృత కూరగాయల మార్కెట్లు, వైకుంఠదామాలు, డంపింగ్ యార్డులు, ప్లే గ్రౌండ్లు, చిల్డ్రన్ పార్కులు, మురుగు కాల్వలు, మహిళ భవనాలు, ఓపెన్ జిమ్‌లు, అంతర్గత రోడ్లు, వీధి దీపాల ఏర్పాట్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్స్, పబ్లిక్ టాయిలెట్స్, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో రూ.20 కోట్ల నిధులతో అధునాతన సౌకర్యాలతో వైకుంఠ ధామం నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.

శకటాలు, స్టాల్స్..

వేడుకల్లో భాగంగా జెడ్పీ బాయిస్ హైస్కూల్ మైదానంలో పలు శకటాలు ప్రదర్శించారు. రవాణా శాఖ, టీఎస్‌ఆర్టీసీ, ఫైర్, వైద్య, ఆరోగ్యశాఖ, అటవీశాఖ, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ, సఖికేంద్ర, 108, 104 తదితర శకటాలు ప్రదర్శించారు. మైదానంలో ప్రభుత్వ శాఖ స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్‌మోతిలాల్, జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు తిలకించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, హార్టికల్చర్, ఐసీడీఎస్, సైన్స్‌ఫేర్, పాడిపరిశ్రమాభివృద్ధి, పరిశ్రమాభివృద్ధి, వ్యవసాయ, అటవీ, పశువైద్యం, బ్యాంకులు, ఐకేపీ, తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి నిర్వాహకులను ప్రశంసించారు.

రహదారులు, భవనాలు

హాజీపూర్ మండలం గుడిపేటలో రూ.205 కోట్ల వ్యయంతో అధునాతన పరిజ్ఞానంతో వైద్య కళాశాల నిర్మాణం జరుగుతుందని, రూ.81 కోట్ల వ్యయంతో స్టేడియం నిర్మాణం పనులు సాగుతున్నాయన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా రూ.300 కోట్ల ప్రతిపాదనలతో 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, నర్సింగ్ కళాశాల ద్వారా వైద్య విద్య కోసం రూ.40 కోట్లతో భవన నిర్మాణం, రూ.3 కోట్ల వ్యయంతో మందుల నిల్వ గిడ్డంగి నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు.

- గ్రామాల అభివృద్ధి, గ్రామ వికాసమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ వ్యవస్థను వినూత్నమైన సంస్కరణలతో ప్రజల ముంగిట నిలించిందన్నారు.
- 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పన్నుల లక్ష్యం రూ.69 కోట్లకు గాను రూ.54 కోట్లు ప్రగతి సాధించి జిల్లాలో 2,95,760 వాహనాల రిజిస్ట్రేషన్ చేయడం పాటు రహదారులపై నియమ నిబంధనలు పాటించేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో 16,205 మంది తమ వివరాలు నమోదు చేసుకోగా 12 జాబ్ మేళాలు నిర్వహించడం ద్వారా 105 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, బెల్లంపల్లి, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు పాల్గొన్నారు.



వేడుకల్లో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని నృత్యం



శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



జెడ్పీహైస్కూల్ సబ్బెపల్లి విద్యార్థిని నృత్యం



రవాణా శాఖ శకటం



టీజీఎస్ ఆర్టీసీ శకటం



మత్స్యశాఖ శకటం





స్టాళ్లను సందర్శిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, కలెక్టర్ సతీమణి

న్యూస్‌రీల్

మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన దానకిశోర్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ఆ జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్)దీపక్ తివారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. మంచిర్యాల జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, క్యాతనపల్లి, లక్సెట్టిపేట్ మున్సిపాలిటీలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు లేక పాలకవర్గం లేకపోవడంతో ఆ మున్సిపాలిటీకి ఇప్పటికే ప్రత్యేక అధికారి ఉన్నారు. ఇక ఇటీవల మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు. నస్పూర్ మున్సిపాలిటీని ఇందులో విలీనం చేశారు. అయితే మంచిర్యాలను కార్పొరేషన్‌గా మారుస్తూ జీవో విడుదల కాలేదు. అయినా నస్పూర్‌కు ప్రత్యేక అధికారిని నియమించలేదు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలను హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామంలో కలెక్టర్ కు మార్‌దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.6 వేల చొప్పున రెండు విడతల్లో ఏడాదికి రూ.12 వేలు చెల్లిస్తామని పేర్కొన్నారు. ర్యాలీ, నాగారం, గఢ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల్లోని ప్రజలకు, గిరిజనులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఇక్కడ నాలుగు పథకాలు ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ, డీఆర్డీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే పాల్గొన్నారు.




ఇందిరమ్మ ఇంటిపత్రం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో సిటీ పోలీస్ యాక్ట్ సోమవారం నుంచి అమలులో ఉంటుందని సీపీ ఎం. శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 27న ఉదయం 6 గంటల నుంచి 31న ఉదయం 6 గంటల వరకు ఈ యాక్ట్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని హెచ్చరించారు. కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరిట బలవంతంగా వివిధ సంస్థలను, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు.

క్షుద్రపూజల పేరిట మోసం

- ఈజీగా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి..
- రూ.2 లక్షలు వసూలు చేసిన వైనం..
- నలుగురి అరెస్టు.. పరారీలో ముగ్గురు..



పూజారి శీతల్ దత్తాత్రేయకొరివి రుూదవ్

నస్పూర్: డబ్బులు ఈజీగా సంపాదించాలంటే ఇంట్లో క్షుద్రపూజలు చేయించాలని ఓ వ్యక్తిని అతని స్నేహితులు నమ్మించారు. పూజకు రూ.2 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. వారి మాటలు నమ్మిన వ్యక్తి రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన మాదంశెట్టి ప్రభంజన్ కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితులు అయిన పట్టణానికి చెందిన రంజిత్, బాలకృష్ణకు చెప్పాడు. వారు క్షుద్రపూజ లు చేయిస్తే ఆర్థిక సమస్యలు తొలగిపోతాయని, ఈజీగా డబ్బులు వస్తాయని తెలిపారు. మహారాష్ట్రలో దైవ శక్తులు ఉన్న పూజారి ఉన్నాడని తెలిపారు. పూజకు రూ.2 లక్షలు ఖర్చవుతుందని పేర్కొన్నారు. వారి మాటలు నమ్మిన ప్రభంజన్ ఈనెల 24న రూ.2 లక్షలు తీసుకుని రాత్రి 11 గంటలకు నస్పూర్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఐత సత్యనారాయణ ఇంటికి వెళ్లాడు. అక్కడ రంజిత్, బాలకృష్ణలతోపాటు శీతల్ దత్తాత్రేయ కొరివి ఝూదవ్ అనే పూజారి, నస్పూర్, సీతారాంపల్లికి చెందిన దెబ్బటి కిషన్, దంతెల ప్రభాకర్, జగిత్యాలకు చెందిన ఎరిసి ప్రశాంతి ఉన్నారు. అదే రోజు రాత్రి పూజలు ప్రారంభించారు. రాత్రి 2 గంటల సమయంలో పూజలపై ప్రభంజన్‌కు నమ్మకం కుదరకపోవడంతో ఇంటికి వెళ్లిపోతానని తెలిపాడు. దీంతో వారంతా అతడిని బెదిరించారు. దీంతో వారి నుంచి ఎలాగో తప్పించుకున్న ప్రభంజన్ సీసీసీ నస్పూర్ పోలీసులను ఆశ్రయించాడు. వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల రాకను గమనించిన ప్రభాకర్, రంజిత్, బాలకృష్ణ పారిపోయారు. శీతల్ కొరివి ఝూధవ్, దెబ్బటి కిషన్, ఐత సత్యనారాయణ, ఎరిసి ప్రశాంతిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా ఎస్టీపీపీ క్రికెట్ లీగ్



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు, లీగ్ చీఫ్ కోఆర్డినేటర్ పంతులా, అధికారులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో 11వ సీజన్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్లాంటులోని ఆయా డిపార్టుమెంట్లు, ఆయా కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగుల నుంచి 10 జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలను ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని లీగ్ చీఫ్ కోఆర్డినేటర్ పంతులా, వోఅండ్‌ఎం చీఫ్ జెన్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఆటలు ప్రతి ఒక్కరికీ మానసిక ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలుగజేస్తాయన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించాలని పేర్కొన్నారు. అనంతరం మొదటి మ్యాచ్ ఎస్టీపీపీ మావారెక్స్‌కి బీపీఏ ఎగ్జిక్యూటీవ్స్‌కి మధ్య జరిగింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసి న బీపీఏ ఎగ్జిక్యూటీవ్స్ టీం 12 ఓవర్లలో 44 పరుగులు చేసి ఆలౌట్ కాగా మావారెక్స్ టీం 5.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 45 పరుగులు చేసి గెలిచింది. మా వారెక్స్ టీంలో విష్ణువర్ధన్‌రెడ్డి రెండు వికెట్లు తీసి 17 పరుగులు చేయడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఎస్టీపీపీ అధి కారులు ఏకే.సింగ్, సముద్రాల శ్రీనివాస్, సత్యనా రాయణ, అఖిల్‌కపూర్, శ్రీనివాస్, శివప్రసాద్, బ్రహ్మం, మోహన్‌సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బెజ్జూర్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తితో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కుంటలమానెపల్లికి బోర్‌కుట్టే ఎమ్మాజీ (48) వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య రుక్మాబాయి, నలుగురు సంతానం. భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. చుట్టూపక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


నగేశ్ (ఫైల్)

జన్నారం: బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చింతగూడకు చెందిన పూదరి నాగేష్ (47) గతకొన్ని నెలలుగా జన్నారంలో ఇల్లు కట్టుకున్నాడు. ఇటీవల ఇరాక్ నుంచి వచ్చిన ఆయన శనివారం అర్ధరాత్రి చింతగూడ నుంచి జన్నారానికి బైక్‌పై తిరిగివస్తున్నాడు. పైడిపెల్లి గ్రామ సమీపంలోని మెయిన్ రోడ్డుపై అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి లచ్చన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ అటవీ సెక్షన్, లోతొర్రె బీట్‌లో అక్రమంగా శనివారం అర్ధరాత్రి సమయంలో తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. కవ్వాల్ సెక్షన్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో పట్టుకుని సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న ట్రాక్టర్ యజమాని మహిపాల్‌రెడ్డిగా తెలిసిందన్నారు. టైగర్ జోన్ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన అంకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ బస్టాండ్ సమీపంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి బయట ఆడుకుంటున్న జాడి అంకులు (4)పై పిచ్చికుక్క దాడి చేయగా అతని ముఖంపై గాయాలయ్యాయి. అతడి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని పిచ్చికుక్కను తరిమారు. కుటుంబ సభ్యులు బాలుడిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.



ఉత్తమలకు ప్రశంసలు

ప్రశంసపత్రం అందుకుంటున్న అదనపుకలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా 170 మంది ప్రశంసాపత్రాలు అందుకున్నారు.


ఆర్.ప్రకాశ్, ఏసీపీ మంచిర్యాల | ఏ.సుందర్‌రావు ఏసీపీ ఏఆర్ | రవికుమార్, ఏసీపీ బెల్లంపల్లి | పి. రాజేశ్వర్ కలెక్టరేట్ ఏవో | అరవింద్, డీసెక్షన్ సూపరింటెండెంట్ | మోతిరామ్, కలెక్టరేట్ టెక్నికల్ సెక్షన్ | రాజలింగు, సీనియర్ అసిస్టెంట్


శర్వాణి, జూనియర్ అసిస్టెంట్ | జశ్వంత్, సీనియర్ అసిస్టెంట్ | కిరణ్ జూనియర్ అసిస్టెంట్ (కలెక్టర్ సీసీ) | లచన్న ఆఫీస్ సబార్డినేట్ | లక్ష్మణ్ ఆఫీస్ సబార్డినేట్ | వనజ, తహసీల్దార్ జైపూర్ | రమేశ్, డీపీవో మంచిర్యాల | అతిష్ కుమార్, నాయబ్ తహసీల్దార్


జ్యోత్స్న తహసీల్దార్ బెల్లంపల్లి | కల్పన, నాయబ్ తహసీల్దార్ బెల్లంపల్లి | త్రినాథ్ సీనియర్ అసిస్టెంట్ | రాజమణి జూనియర్ అసిస్టెంట్ | మోహన్ ఎంపీవో, చెన్నూర్ | దేవేందర్‌రావు, సూపరింటెండెంట్, లక్సెట్టిపేట | అరుణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్, దండేపల్లి | స్వామి, టైపిస్ట్ ఎంపీపీ, చెన్నూర్


స్వస్తిక జైశ్వాల్, చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి | యశ్వంత్ సబ్ ఇంజనీర్ ఎలక్ట్రిసిటీ | విజయ్ కుమార్ అకౌంటెంట్, డీటీవో | రేఖ, జూనియర్ అసిస్టెంట్ డీటీవో | అరుణ్‌కుమార్ సీవోపీఏ, డీఆర్డీఏ | రంజిత్ కుమార్, ఎంవీఐ మంచిర్యాల | రవికుమార్, కానిస్టేబుల్ | రవికుమార్ ఎస్సై, ఇంటలిజెన్స్ | ప్రసాద్, పీసీ మంచిర్యాల | సత్యనారాయణ, సూపరింటెండెంట్ డీఈవో | అనుష, ఏఈఈ ఆర్‌అండ్‌బీ | తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ డీపీహెచ్‌వో | సహేద ప్రవీణ్, ఎఫ్ఎస్‌వో


సంధ్య,.ఎఫ్ఎస్‌వో చెన్నూర్ | రాజేందర్, ఎస్‌వో, సీపీవో | వెంకటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ | సరిత, హెచ్‌డబ్ల్యూవో బెల్లంపల్లి | మధుశ్రీ, ఏఈఈ మిషన్‌భగీరథ | మల్లికార్జున్, ఏఎల్ఎం మందమర్రి | ఏ.అశోక్, సీఐ మంచిర్యాల | ప్రసాద్, ఎస్సై నెన్నెల | ప్రవీణ్ కుమార్ ఎస్సై, కాసిపేట | హైమ, ఎస్సై షీటీమ్ మంచిర్యాల | భరత్, పీసీ మంచిర్యాల | జి. సంతోష్ కుమార్ ఏఆర్‌పీసీ, | నవీన్, పీసీ


ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు


శ్రీరాంపూర్: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


మందమర్రిరూరల్: విద్యార్థుల నృత్యాలు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- గనులపై గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండావిష్కరించిన జీఎంలు
- ఉత్తమ ఉద్యోగులకు సన్మానం


జెండాకు వందనం చేస్తున్న మందమర్రి ఏరియా జీఎం


శ్రీరాంపూర్: జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పిస్తున్న జీఎం సూర్యనారాయణ


శ్రీరాంపూర్: హెచ్‌ఎంఎస్ కార్యాలయం వద్ద ..

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి గనులు, కార్మికవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. సింగరేణి ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో, తన కార్యాలయం వద్ద శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ, మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో జీఎం దేవేందర్ దంపతులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సింగరేణి ప్రగతి సాధిస్తుందని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో 18 మంది, మందమర్రి ఏరియాలో 12 మంది ఉత్తమ ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని వద్ద పీవో టి.శ్రీనివాస్, శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని ఆటో యూనియన్ కార్యాలయం వద్ద నాయకుడు ముఖేష్‌గౌడ్, హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్యాలయం వద్ద కేంద్ర కార్యదర్శి గొల్ల సత్యనారాయణలు జాతీయ జెండాలు ఎగురవేశారు. కంపెనీ విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం వారు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో..


జాతీయ జెండా ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగిలు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ గోవర్ధన్ జాతీయ జెండావిష్కరించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శించిన కవాతు ఆకట్టుకుంది. వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, సెక్యూరిటీ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రభాకర్, శ్యాంబాబు, రవికిరణ్, రఘువీర్, స్వప్న, విజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో బెటాలియన్‌కు ప్రథమ స్థానం


బహుమతి అందుకుంటున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో పరేడ్‌లో గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ నుంచి పాల్గొన్న కాంటింజెంట్ ప్రథమ బహుమతి సాధించింది. అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్ఐ ఎం.శ్రీనివాస్, ఆర్ఎస్సైలు రవి, రాజశేఖర్, సిబ్బంది మొత్తం 40 మంది ఉన్నారు. రాష్ట్రం నుంచి పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గవర్నర్ రామెన్ దేఖా, డీజీపీ అశోక్‌జునేజా బహుమతి అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, ఆర్ఐలు సిబ్బంది వారిని అభినందించారు.

- గుడిపేట బెటాలియన్‌లోని పరేడ్ మైదానంలో కమాండెంట్ వెంకటరాములు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మెడికల్ అధికారులు సంతోశ్‌సింగ్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ఎస్సైలు, ఏఆర్ఎస్సైలు, కానిస్టేబుళ్లకు ఉత్కృష్ట పతకాలను కమాండెంట్ అందజేశారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. 76వ గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని ఆదివారం ఐటీడీఏ ప్రాంగణంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయిలతో కలిసి ఐటీడీఏ పీవో జాతీయజెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు బాగా చదివి ఐపీఎస్, ఐఏఎస్‌లుగా రాణించాలన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా గిరిజనాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను పీవో వివరించారు. 11 మండలాల్లో 11 పీహెచ్‌సీల్లో అవ్వల్ అంబులెన్స్ ద్వారా 2023–24లో 2644 మంది గర్భిణులకు ప్రసవాలు జరిగినట్లు తెలిపారు. అంతకుముందు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీవో జనరల్ వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఈఈ తానాజీ పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఒకరిపై అట్రాసిటీ కేసు

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన మిల్కూరు మల్లేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగపేట గ్రామానికి చెందిన ఆవునూరి రాజయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిలో సాగు చేసుకుంటున్నాడు. అయితే పల్లికొండ రమేశ్ నుంచి ఆ భూమిని కొనుగోలు చేశానని మల్లేశ్ శనివారం ట్రాక్టర్ వీల్స్‌తో పంటను ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన రాజయ్యను కులం పేరుతో దూషించి నెట్టివేశాడు. బాధితుడు రాజయ్య ఫిర్యాదుతో ఆదివారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరి‘కుండ’లోనే నాగోబా నైవేద్యం

ఇచ్చోడ: ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాకు అభిషేకం చేయాలన్నా .. నైవేద్యం సిద్ధం చేయాలన్నా సిరికొండ కుండలనే వాడుతారు. శతాబ్దాలుగా సిరికొండలోని గుగ్గిల వంశీయులు తయారు చేసిన కుండలోనే నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. నాగోబా అప్పట్లో మెస్రం వంశీయులకు కలలో వచ్చి సిరికొండలో నివసిస్తున్న గుగ్గిల వంశీయులు తయారు చేసిన కుండలనే పూజలకు ఉపయోగించాలని చెప్పినట్లు ప్రతీతి. పూజ ప్రారంభం నుంచి అఖరి రోజు నైవేద్యం సమర్పించే వరకు ఇక్కడి కుండలనే వాడుతారు.

ప్రచారయాత్రలోనే కుండల తయారీకి ఆర్డర్

కేస్లాపూర్ నాగోబా ఆలయం నుంచి ప్రారంభమైన కటోడ మెస్రం కోసేరావు, పర్ధాన్ దాదారావులతో కూడిన ప్రచారం రథం(ఎడ్లబండి) మొదటిరోజే సిరికొండ మండల కేంద్రంలో ఉన్న గుగ్గిల స్వామి ఇంటికి చేరుకొని జాతరకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డర్ ఇస్తారు. మరుసటి రోజు నుంచే కుండల తయారీ ప్రారంభిస్తారు. తయారైన కుండలకు మహాజాతర ప్రారంభానికి రెండు రోజుల ముందు మెస్రం వంశీయులు పూజలు నిర్వహించి ఎడ్లబండిపై కేస్లాపూర్‌కు తీసుకెళ్తారు.

ఏడు రకాలు.. 350 మట్టిపాత్రలు

20 పెద్ద బాణాల్లో గంగాజలం పోసి నిల్వ ఉంచుతారు. 55 నీటి కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలు, 25 పెంకలను ఆదివాసీలు ఆలయ పరిసర ప్రాంతాల్లో పిండివంటలు, నైవేద్యాలు తయారు చేయడానికి వాడుతారు. వీటి తయారీకి గుగ్గిల స్వామి, అతని భార్య నెలరోజుల పాటు కష్టపడుతారు. స్వామి తండ్రి రాజన్న 75 ఏళ్లపాటు కుండలు తయారు చేసి అందించారు. రాజన్న తండ్రి రాజన్న సైతం 70 ఏళ్ల కుండలను తయారు చేసి ఇచ్చారు. ప్రస్తుతం స్వామి దాదాపు 40 ఏళ్లుగా కుండలను తయారు చేసి ఇస్తున్నారు.


జాతర కోసం తయారుచేసిన కుండలు

తరాల నుంచి..



తరతరాలుగా తాతముత్తాల నుంచి కుండలు తయారీ చేసి నాగోబాకు ఇస్తున్నాం. నాగోబా జాతర ప్రారంభం నుంచి మా వంశమే కుండలను తయారు చేస్తుంది.

– గుగ్గిల స్వామి, సిరికొండ

ఆచారం కోసం నేర్చుకుంటున్నా..



కుండ తయారీ ఉపాధిని ఇవ్వడం లేదు. దశాబ్దాల నుంచి తమ వంశమే నాగోబా జాతరకు కుండలు తయారు చేసి ఇస్తున్నాం. ఆచారం కోసం తండ్రి వద్ద కుండల తయారీ నేర్చుకుంటున్నాను.

–గుగ్గిల గంగాధర్, గుగ్గిల స్వామి కుమారుడు

తయారీకి నెల సమయం..



ఏడు రకాలుగా 350 మట్టిపాత్రల తయారీకి నెల సమయం పడుతుంది. అడవి నుంచి మట్టిని తీసుకురానివ్వడంలేదు. దూరప్రాంతాల నుంచి మట్టిని డబ్బులతో కొనుగోళ్లు చేస్తున్నాం. వీటిని విక్రయిస్తే రూ.50 వేలు వస్తాయి. కాని కేవలం రూ.10 వేలు ఇస్తున్నారు. దైవకార్యమని కుండలను తయారీ చేసి ఇస్తున్నాం.

– గుగ్గిల కళావతి, గుగ్గిలస్వామి భార్య

దివ్యాంగులకు అండగా పథకాలు

మంచిర్యాలటౌన్: దివ్యాంగులకు అండగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 25 మంది దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం కింద వంద శాతం సబ్సిడీతో రూ.50 వేల చెక్కులు మంజూరయ్యాయి. వాటిని గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు ప్రదానం చేశారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షలు, రూ.3 లక్షల చెక్కులను ఇద్దరికి అందించారు. ఉచిత ఉపకరణాల పంపిణీలో భాగంగా మోటార్ వెహికిల్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్‌ఖాన్, సీడీపీవో విజయలక్ష్మి, స్వరూపరాణి, ఎఫ్ఆర్‌వో ఫర్జానా, కోఆర్డినేటర్ సౌజన్య పాల్గొన్నారు.


దివ్యాంగులకు చెక్కులను అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్